సాక్షి
అనంతపురం

సోమవారం । 1 । జూలై । 2024



విలక్షణం.. బంజారాల జీవితం

బంజారాలు విలక్షణ జీవితంతో ప్రత్యేకంగా నిలుస్తున్నారు. మంగళవారం అనంతపురంలో బోనాల పండుగ నిర్వహించనున్నారు. 8లో



అల్లుడే హంతకుడు

కళ్యాణదుర్గం సమీపంలో జరిగిన వ్యక్తి హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. అల్లుడే హంతకుడని గుర్తించారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.2°/23.6°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

మొబైల్ బిల్లు.. జేబుకు చిల్లు

- టారిఫ్‌లు పెంచేసిన సర్వీస్ ప్రొవైడర్లు
- మూడో తేదీ నుంచి అమలులోకి
- నెలకు ఒక్కో సిమ్‌పై సగటున రూ.50 మేర అదనపు భారం
- ఉమ్మడి జిల్లాలో 14 లక్షలకు పైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: మొబైల్ వినియోగదారులకు చేదు వార్త. లక్షలాదిమంది జేబులకు చిల్లు పడనుంది. ఈ నెల 3వ తేదీ నుంచి సర్వీసు ప్రొవైడర్లు మొబైల్ సిమ్ రీచార్జ్ బిల్లులు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో దిన కూలీనుంచి వేతన జీవుల వరకూ ప్రతి ఒక్కరిపైనా భారం పడనుంది. ప్రతి ప్లాన్ మీదా కనిష్టంగా రూ.35 నుంచి గరిష్టంగా రూ.600 వరకు చార్జీలు పెంచుతూ ఆయా సర్వీస్ ప్రొవైడర్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్మార్ట్‌ఫోన్, ఆండ్రాయిడ్, కీప్యాడ్ మొబైల్ వినియోగదారులందరూ పెంచిన చార్జీల పరిధిలోకి వస్తారు.

నెలకు రూ.11 కోట్ల మేర అదనపు చెల్లింపులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన ఆరేళ్లుగా మొబైల్ ఫోన్‌లు భారీగా పెరిగాయి. ప్రతి ఇంటికీ ఒకటి లేదా రెండు ఫోన్‌ల చొప్పున వాడుతున్నట్టు అంచనా. 14 లక్షల వరకు స్మార్ట్‌ఫోన్లు, 8 లక్షల వరకూ కీప్యాడ్ ఫోన్‌లు వినియోగిస్తున్నట్టు ట్రాయ్ (టెలిఫోన్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) గణాంకాల ప్రకారం తేలింది. ఈ మొత్తం వినియోగదారులు తాజాగా పెరిగిన చార్జీల ప్రకారం సిమ్‌కు నెలకు సగటున రూ.50 వరకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఉమ్మడి జిల్లా మొత్తం మీద నెలకు సుమారు రూ.11 కోట్లు అదనంగా చెల్లించాలి. ఇప్పటివరకూ స్మార్ట్ ఫోన్ వినియోగించే వారు సిమ్‌కు నెలకు రూ.200 చొప్పున మొత్తం మీద నెలకు రూ.28 కోట్ల వరకూ చెల్లిస్తున్నారు. అంటే ఏడాదికి రూ.336 కోట్లు కేవలం స్మార్ట్ ఫోన్‌ల ద్వారానే చెల్లిస్తున్నారు. తాజాగా పెంచిన రేట్లతో ఆ బిల్లు రూ.420 కోట్లకు చేరుతోంది. స్మార్ట్‌ఫోన్ల నుంచే ఏడాదికి రూ.84 కోట్లు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

- ఇక కీప్యాడ్ ఫోన్‌లు మరో 8 లక్షలు ఉన్నాయి. ఈ వినియోగదారులకు కూడా పెంచిన టారిఫ్‌లు వర్తించనున్నాయి. దీంతో భారీగానే అదనపు చెల్లింపు చేయాల్సి వస్తుంది.

సామాజిక మాధ్యమాల ప్రభావం..

స్మార్ట్ ఫోన్ బిల్లుల రూపేణా దుష్ప్రభావం చూపించడమే కాదు, కాలం హరించుకుపోతున్నట్టు నిపుణుల పరిశీలనలో వెల్లడైంది. లక్షలాది మంది యువత గంటల తరబడి సామాజిక మాధ్యమాల్లో మునిగి తేలుతోంది. దీంతో కాలం హరించుకుపోవడమే కాదు, నెట్ బిల్లుల రూపేణా నెలకు వందల రూపాయలు చెల్లిస్తున్నారు. మరోవైపు చదువుకున్న యువత ఎక్కువగా ఫోన్ వాడకం వల్ల పోటీ పరీక్షల్లోనూ వెనుకబడిపోతున్నారు. ఇంకోవైపు మానసిక ఒత్తిళ్లు, నరాల జబ్బుల పరంగా రకరకాల రుగ్మతలకు గురవుతున్నారు. అవసరాలకు కాకుండా పనిలేని వాటికి స్మార్ట్‌ఫోన్ వాడటం వల్ల ఆర్థికంగానూ, ఆరోగ్యపరంగానూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో యువతీ యువకుడు రోజుకు కనిష్ఠంగా 3 గంటల పాటు సామాజిక మాధ్యమాల్లోనే మునిగితేలుతున్నట్టు వెల్లడైంది.

ట్రాయ్ అంచనా ప్రకారం ఉమ్మడి జిల్లాలో ఫోన్ల వినియోగదారులు...

స్మార్ట్ ఫోన్‌ల వాడకం	14 లక్షలు
కీప్యాడ్ ఫోన్‌లు	8 లక్షలు
మొత్తం	22 లక్షలు

(వినియోగదారుల సంఖ్యను సిమ్‌ల ఆధారంగా లెక్కిస్తారు)

సర్వీసు ప్రొవైడర్లు ప్రకటించిన కొత్త టారిఫ్

ప్రస్తుత ధర	సామర్థ్యం	కొత్త టారిఫ్
నెలవారీ టారిఫ్‌లు		
రూ.155	2జీబీ నెలకు	రూ.189
రూ.299	2జీబీ రోజుకు	రూ.349
రూ.399	3జీబీ రోజుకు	రూ.449
రెండు నెలల టారిఫ్		
రూ.479	1.5జీబీ రోజుకు	రూ.579
రూ.533	2జీబీ రోజుకు	రూ.629
3 నెలలకు టారిఫ్		
రూ.666	1.5జీబీ రోజుకు	రూ.799
రూ.719	2జీబీ రోజుకు	రూ.859
ఏడాదికి టారిఫ్ ఇలా		
రూ.1559	24 జీబీ	రూ.1899
రూ.2999	2.5జీబీ రోజుకు	రూ.3599

న్యూస్‌రీల్

పౌర హక్కులపై అవగాహన



పౌరులకు ప్రాథమిక హక్కుల గురించి వివరిస్తున్న దృశ్యం

అనంతపురం: ఎస్పీ గౌతమి సాలి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు 'పౌరహక్కుల దినోత్సవం' (సివిల్ రైట్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు సంయుక్తంగా వెళ్లి రాజ్యాంగంలోని చట్టాలు, పౌర హక్కుల గురించి వివరించారు.

రూ.11లక్షలతో వీహెచ్‌ఏ పరార్



వీహెచ్‌ఏపై ఫిర్యాదు చేస్తున్న ఏఓ మహేష్

కళ్యాణదుర్గం: సబ్సిడీ విత్తనవేరుశనగకు రైతులు చెల్లించిన సొమ్ములోంచి రూ.11 లక్షలు తీసుకుని వీహెచ్‌ఏ పరారయ్యాడు. వ్యవసాయ శాఖ అధికారి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కుందుర్పి మండలం జంబుగుంపల ఆర్‌బీకేలో వీహెచ్‌ఏ (విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్)గా ప్రవీణ్ పనిచేస్తున్నాడు. ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేసేందుకు ఈయన్ని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఏపీ సీడ్స్ నుంచి 1002 బస్తాల వేరుశనగ ఆర్‌బీకేకి వచ్చింది. రైతుల నుంచి సబ్సిడీ పోను మిగతా సొమ్మును వసూలు చేసి అందులో రూ.5.90 లక్షల నగదును మాత్రమే మే 25న ఏపీ సీడ్స్ వారికి జమ చేశాడు. మిగిలిన మొత్తం రూ.11,23,420 చెల్లించాలని వీహెచ్‌ఏను ఏఓ కోరగా.. త్వరలో చెల్లిస్తానని చెప్పి కనిపించకుండా పోయాడు. రోజులు గడుస్తున్నా మనిషి పత్తా లేదు. సెల్‌ఫోన్ స్విచాఫ్ అని వస్తోంది. రూ.11.23 లక్షలతో ప్రవీణ్ ఉడాయించాడన్న అనుమానంతో ఆదివారం కుందుర్పి పోలీసులకు వ్యవసాయ అధికారి మహేష్ ఫిర్యాదు చేశారు.

తుంగభద్ర జలాశయానికి జలకళ

- ఎగువన గాజనూరు జలాశయం గేట్లు ఎత్తివేత
- శివమొగ్గ జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు
- టీబీ డ్యాంకు 6,730 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం జలకళ సంతరించుకుంటోంది. కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో కొద్ది రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన ఉన్న గాజనూరు జలాశయం (అప్పర్ తుంగ ప్రాజెక్ట్)లో నీటి నిల్వ గరిష్ట మట్టానికి చేరింది. దీంతో ఆదివారం అక్కడి ఇంజినీర్లు కొన్ని గేట్లను ఎత్తి సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఆ నీరు దిగువన ఉన్న తుంగభద్ర డ్యాంకు చేరుతున్నట్లు బోర్డు అధికార వర్గాలు తెలిపాయి. ఎగువన ఉన్న చిక్‌మంగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మలేనాడు, తీర్థనహళ్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తుంగ డ్యాం నుంచి నీటిని విడుదల చేయడంతో కర్ణాటక, ఆంధ్రా రాష్ట్రాలకు సంబంధించిన ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- గతేడాది ఈ సమయానికి టీబీ డ్యాంలో 3 టీఎంసీలు ఉండగా.. నేడు 6 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉంది. తుంగభద్ర జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులకు గాను ప్రస్తుతం 1582.48 అడుగులు ఉంది. నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్ ఇనఫ్లో 6,730 క్యూసెక్కులుండగా అవుట్‌ఫ్లో 296 క్యూసెక్కులుంది. గతేడాది ఇదే సమయానికి 1577.29 అడుగులతో 3.295 టీఎంసీల నీరు నిల్వతో 343 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉండేది.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలే

అనంతపురం టౌన్: ఇసుక అక్రమ తవ్వకాలతో పాటు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలుపుదల చేశామన్నారు. ఇసుక తవ్వకాల కోసం జిల్లాలో ఎవ్వరికి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా చేస్తే ఫిర్యాదు చేయాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను జప్తు చేయడంతోపాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై 08554-220946 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

పీఆర్ ఎస్‌ఈగా కేవీకేవీ ప్రసాద్



ఎస్‌ఈగా కేవీకేవీ ప్రసాద్

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ)గా కేవీకేవీ ప్రసాద్ నియమితులయ్యారు. అనంతపురంలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా పని చేస్తున్న ఈయనకు పీఆర్ ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎస్‌ఈగా పని చేసిన ఎం.ఈరాస్వామి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో కేవీకేవీ ప్రసాద్‌ను నియమిస్తూ..ఆ శాఖ ఈఎన్‌సీ బాలు నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

3లోగా తుది అకౌంట్లు సమర్పించాలి

- అభ్యర్థులకు ఎన్నికల వ్యయ పరిశీలకుల సూచన



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు విలాస్ వి.షిండే, చిత్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్, పరిశీలకులు నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయానికి సంబంధించి తుది అకౌంట్లు సమర్పించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే సూచించారు. ఎన్నికల వ్యయానికి సంబంధించి తుది అకౌంట్ల సమర్పణ అంశంపై పరిశీలకులు విలాస్ వి.షిండే, నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలేలు ఆదివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో కలిసి అభ్యర్థులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు వారు తగిన సూచనలిచ్చారు. ఎన్నికలు పూర్తయిన తరువాత చేపట్టే అకౌంట్ రీ కన్సలేషన్‌పై అభ్యర్థులు, రాజకీయ పార్టీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అభ్యర్థులు వారి రికార్డులను, రిజిష్టర్లను, బ్యాంక్ అకౌంట్ వివరాలు, స్టేట్‌మెంట్లు డీఈఎంసీకి సమర్పించాలన్నారు. ఈ నెల మూడో తేదీనాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ రిజిష్టరింగ్, రికార్డింగ్ ఎక్స్‌పెండేచర్ వివరాలను అందించాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈసీకి వివరాలు పంపించాలి..

ఎన్నికల ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోగా ప్రతి అభ్యర్థీ తమ వ్యయ వివరాలను బిల్లులతో సహా సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. ఈ క్రమంలో ఎన్నికల వ్యయ అకౌంట్ రీ కన్సలేషన్ చాలా ముఖ్యమైన అంశమన్నారు. ఈ నెల 11వ తేదీలోగా ఎన్నికల కమిషన్‌కు అందరు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయానికి సంబంధించి అకౌంట్ వివరాలను పంపించాల్సి ఉందన్నారు. ఈ నెల మూడో తేదీలోగా తుది అకౌంట్ల వివరాలను ఫైనలైజ్ చేయాలన్నారు. సమావేశంలో డీసీఓ అరుణకుమారి, ఆర్డీఓలు జి.వెంకటేష్, వి.శ్రీనివాసులురెడ్డి, ఆర్‌ఓ శిరీష, పర్యాటక శాఖ ఆర్‌డీ వెంకటేశ్వర్లు, ఎక్స్‌పెండేచర్ మానిటరింగ్ టీమ్ అధికారులు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులు వేగవంతం చేయాలి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న డ్రైల్యాండ్ హార్టికల్చర్ పనులను వేగవంతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం జిల్లాలోని ఏపీడీలు, ఏపీఓలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 9 వేల ఎకరాల్లో పండ్ల తోటలను అభివృద్ధి చేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటికే 5వేల ఎకరాలకు సంబంధించి పండ్ల మొక్కలు కావాలని రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రస్తుత వర్షకాలంలోనే పొలాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జూలై మొదటి వారంలో రైతుల పొలాల్లో గుంతలు తవ్వే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రైతులు ఎలాంటి పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి ఉంటే అలాంటి మొక్కలనే సరఫరా చేసే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులే నేరుగా మొక్కలను కొనుగోలు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన ధరల మేరకు రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయనున్నట్లు చెప్పారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకంపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ ఏడాది చీనీ, జామ, నిమ్మ, అంజూర, డ్రాగన్ ఫ్రూట్, సపోట, మామిడి, అల్లనేరేడు తదితర పండ్ల మొక్కల సాగుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

సర్వజనాస్పత్రిలో నైట్ డ్యూటీల లొల్లి

- స్టాఫ్‌నర్సులపై పని ఒత్తిడి
- మరో పది రోజులు అదనపు డ్యూటీలు
- సర్వజనాస్పత్రి అధికారుల ఓవరాక్షన్



ప్రభుత్వ సర్వజనాస్పత్రి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా స్టాఫ్‌నర్సులపై పని ఒత్తిడి విపరీతంగా పెరిగింది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పర్యటన ఉంటుందని నైట్ డ్యూటీలు మరో పది రోజులు ఏకధాటిగా పెంచుతూ ఆస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఆర్ఎంఓ పద్మజ ఉత్తర్వులు జారీ చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 400 మందికిపైగా స్టాఫ్‌నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో హెడ్ నర్సులు 45, రెగ్యులర్ స్టాఫ్‌నర్సులు 112, సీబీ 1 – 48, సీబీ 2 – 112, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 116 మంది స్టాఫ్‌నర్సులు ఉన్నారు.

విధులు ఇలా..

స్టాఫ్‌నర్సుల రోస్టర్ ప్రకారం మొదటి నెల ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, రెండో నెలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు, మూడో నెలలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటలు, రాత్రి 8 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు విధులుంటాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రాత్రి వేళ 80 నుంచి 90 మంది స్టాఫ్‌నర్సులు విధుల్లో ఉంటారు. రాత్రి పూట అడ్మిషన్‌లో 1100 మంది, క్యాజువాలిటీ (అత్యవసర విభాగం)లో 500 మంది దాకా రోగులకు తీరిక లేకుండా వైద్య సేవలందించాల్సి ఉంటుంది. ఇలా ఒక కార్యాచరణ ప్రకారం డ్యూటీలు సాగుతుంటాయి. అందుకు అనుగుణంగా వారి విధులు, కుటుంబ నిర్వహణకు కార్యాచరణ చేసుకుని ముందుకు సాగుతుంటారు.

వివాదాస్పద నిర్ణయం..

అయితే సర్వజనాస్పత్రి అధికారులు ఈసారి డ్యూటీల విషయంలో తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. జూన్‌లో నైట్ డ్యూటీలు ముగిసి జూలైలో పగలు డ్యూటీకి వెళ్లాల్సిన స్టాఫ్‌నర్సులకు మరో పది రోజులపాటు నైట్ డ్యూటీలు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. రొటేషన్‌లో భాగంగా ఇతర స్టాఫ్‌నర్సులు ఆ డ్యూటీలు చేసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే తమపై పని ఒత్తిడి పెంచుతున్నారని బాధిత నైట్‌డ్యూటీ స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమని అడిగితే మంత్రి పర్యటన అంటూ సాకు చెబుతున్నారని ఆరోపించారు.

విధుల పొడిగింపు వాస్తవమే

స్టాఫ్‌నర్సుల డ్యూటీల రోస్టర్‌లో మార్పులు చేయాల్సి ఉంది. రాత్రి వేళలో విధులు నిర్వర్తించే స్టాఫ్‌నర్సుల విధులు మరికొన్ని రోజుల పాటు కొనసాగించేలా చర్యలు తీసుకున్నాం. రోస్టర్‌లో మార్పులు చేసిన తర్వాత విధులు మార్చుతాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, సర్వజనాస్పత్రి

వేరుశనగకు రూ.406 'మద్దతు' పెంపు



వేరుశనగ



కందులు



మొక్కజొన్న



పత్తి

- 2024-25 ఏడాదికి మద్దతు ధరలు ప్రకటించిన కేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైసెస్-ఎంఎస్‌పీ) ప్రకటించింది. గత ఐదేళ్ల ఆనవాయితీని కొనసాగిస్తూ రైతులకు కొంత వరకు ఉపయోయోగపడేలా ముందస్తుగా మద్దతు ధరలు వెల్లడించింది. దేశవ్యాప్తంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పంటల వారీగా పెడుతున్న పెట్టుబడులు, వస్తున్న దిగుబడులు, మార్కెట్‌లో పలుకుతున్న ధరలు, రైతులకు లభిస్తున్న నికరాదాయం... తదితర గణాంకాలు పరిగణనలోకి తీసుకుని అమ్మకం ధరలు ఖరారు చేశారు. ప్రస్తుత ఖరీఫ్, రాబోయే రబీలో పండించే పంట ఉత్పత్తులకు ఈ ధరలు వర్తించనున్నాయి.

15 పంటలకు ఎంఎస్‌పీ..

ఇటీవల కేంద్ర ప్రభుత్వం 15 రకాల ప్రధాన పంటలకు ఎంఎస్‌పీ ప్రకటించింది. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి తీసుకుంటే వరి, వేరుశనగ, కందులు, మొక్కజొన్న, పత్తి లాంటి ముఖ్యమైనవి. వేరుశనగ విషయానికి వస్తే గతేడాది కన్నా క్వింటాలుపై రూ.406 పెంచారు. అలాగే పత్తికి రూ.501, కందులకు రూ.550, మొక్కజొన్నకు రూ.135, వరి ధాన్యంపై రూ.117, అత్యధికంగా నువ్వులపై రూ.632, రాగులపై రూ.444, మినుములపై రూ.450, అత్యధికంగా నైగర్‌సీడ్ (వెర్రినువ్వులు-ఒడిసెలు)కు రూ.983 ప్రకారం పెంపుదల చేశారు. రైతులు పంటలు పండించిన తర్వాత బహిరంగ మార్కెట్‌లో ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధర ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనుగోలు చేయనున్నారు. వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ, పౌరసరఫరాలశాఖ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఏపీ సీడ్స్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తదితర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోళ్లు చేస్తూ వస్తున్నారు. ఇలా... గత ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ధరలు తగ్గినపుడు రైతులు నష్టపోకుండా రూ.280 కోట్లు విలువ చేసే 95 వేల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు కొనుగోలు చేసింది.

పంటల వారీగా కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటాలుకు ఇలా...

పంట	ప్రస్తుత ఏడాది	గత ఏడాది	పెరిగిన ధర
వరి (సాధారణం)	రూ.2,300	రూ.2,183	రూ.117
వరి (ఏ-గ్రేడు)	రూ.2,320	రూ.2,203	రూ.117
వేరుశనగ	రూ.6,783	రూ.6,377	రూ.406
కందులు	రూ.7,550	రూ.7 వేలు	రూ.550
పత్తి (మీడియం)	రూ.7,121	రూ.6,620	రూ.501
పత్తి (పొడవు రకం)	రూ.7,521	రూ.7,020	రూ.501
మొక్కజొన్న	రూ.2,225	రూ.2,090	రూ.135
జొన్న (మాల్దండి)	రూ.3,421	రూ.3,225	రూ.196
జొన్న (హైబ్రీడ్)	రూ.3,371	రూ.3,180	రూ.191
సజ్జలు	రూ.2,625	రూ.2,500	రూ.125
రాగులు	రూ.4,290	రూ.3,846	రూ.444
పెసలు	రూ.8,682	రూ.8,558	రూ.124
మినుములు	రూ.7,400	రూ.6,950	రూ.450
నువ్వులు	రూ.9,267	రూ.8,635	రూ.632
నైగర్‌సీడ్ (ఒడిసెలు)	రూ.8,717	రూ.7,734	రూ.983
పొద్దుతిరుగుడు	రూ.7,280	రూ.6,760	రూ.520
సోయాబీన్	రూ.4,892	రూ.4,600	రూ.292

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- ఉరవకొండలో పెరిగిపోతున్న టీడీపీ దౌర్జన్యాలు
- ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెప్తాం
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం కార్పొరేషన్/ ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ దౌర్జన్యాలను నిరసిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఉరవకొండ నియోజకవర్గ ముఖ్య నేతల సమావేశం జరిగింది. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉరవకొండలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ టీడీపీ గూండాలు చెలరేగిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ఉపసర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని హత్యాయత్నాలు, ఇళ్లపై దాడులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. ఇళ్లు, ఊళ్లు వదలకపోతే చంపేస్తామని బెదిరిస్తున్నారన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీ వై.రాంపురంలో టీడీపీకి ఓటు వేయలేదని పేదల నుంచి బలవంతంగా బాండ్లు రాయించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ దుశ్చర్యలను పోలీసులు ఆపకపోగా.. టీడీపీ నేతల ఒత్తిళ్లతో బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఇలాంటి అప్రజాస్వామ్య విధానాలను ఇక సహించేంది లేదని, వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు. ఆ సమయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో వందలాది మందితో త్వరలో ధర్నా చేపడతామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పాలన సాగించారని గుర్తు చేశారు. ప్రజలు అధికారం ఇచ్చేది మంచి పాలన అందించాలని, అందరినీ సమానంగా చూడాలని కానీ ఏకపక్షంగా వ్యవహరించాలని కాదన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, అధికార టీడీపీ నాయకులకు ప్రజాస్వామ్య పద్ధతిలోనే గుణపాఠం చెబుతామని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, బెళుగుప్ప వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దుద్దేకుంట రామాంజనేయులు, ఉరవకొండ జెడ్పీటీసీ పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు కేసుకు భయపడి ఆత్మహత్య

అనంతపురం సిటీ: పోలీసు కేసుకు భయపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు... అనంతపురంలోని ఆజాద్ నగర్‌కు చెందిన తాడిపత్రి షేక్ అబ్దుల్లా (35)కు భార్య నసీమ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. నగరంలోని మహేంద్ర కార్ల షోరూంలో పెయింటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో సౌమ్యుడిగానే మంచి పేరున్నా... మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల మద్యం మత్తులో అబ్దుల్లా ద్విచక్ర వాహనంపై వెళుతూ మరో వ్యక్తిని ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రి పాలయ్యాడు. ఆ సమయంలో కొందరు జోక్యం చేసుకుని బాధితుడికి ఆస్పత్రి ఖర్చులు ఇప్పిస్తామని పోలీసు కేసు నమోదు కాకుండా రాజీ చేసినట్లు సమాచారం. అయితే సంపాదన అంతంత మాత్రంగానే ఉన్న అబ్దుల్లా... ఒప్పందం మేరకు డబ్బు ఎలా సమకూర్చాలో అర్థం కాక సతమతమవుతూ వచ్చాడు. వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో ఎలాగైన పోలీసు కేసు అవుతుందని భయపడిన ఆయన క్షణికావేశంలో శనివారం అర్ధరాత్రి ఒంటి గంట దాటిన తర్వాత అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుని పట్టాలపై పడుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నసీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం

తాడిపత్రి అర్బన్: మద్యానికి బానిసైన ఓ యువకుడు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం చౌటిపల్లి గ్రామానికి చెందిన రవీంద్ర(36)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసైన రవీంద్ర మతిస్థిమితం కోల్పోయి తిరిగేవాడు. ఈ క్రమంలో తాడిపత్రి మండలం చల్లవారిపల్లి వద్ద ఆదివారం పట్టాలపై చేరుకున్న ఆయన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. లోక్ పైలెట్ సమాచారం మేరకు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

విలక్షణం... బంజారాల జీవితం



తండావాసులు ఇలవేల్పుగా కొలిచే అమ్మవారు



'బంజారా..' ఈ పేరు వినగానే విభిన్నమైన వేషధారణతో ఉన్న స్త్రీలు, అజానుబాహులైన పురుషులు కళ్ల ముందు కనిపిస్తారు. అయితే వీరు అసమాన వీరపరాక్రమాలకు ప్రతీకలైన రాజపుత్రులకు వారసులనే విషయం కొద్దిమందికే తెలుసు. సంచార జాతులుగా జీవిస్తున్న బంజారాలు ఒకనాడు సూర్య, చంద్ర వంశాలకు చెందిన రాజపుత్రులని చరిత్ర చెబుతోంది. వారి ఆచారాలు, వ్యవహారాలు, వేషధారణలూ విలక్షణంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో తమ సంస్కృతికి అద్దం పట్టే బోనాల పండుగను మంగళవారం శోభాయమానంగా నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. – అనంతపురం కల్చరల్:

ఉమ్మడి జిల్లాలో బంజారాలు ఇలా...

గిరిజన తండాలు: **649** గిరిజన పంచాయతీలు : **242**

బంజారాల సంఖ్య: దాదాపు **2** లక్షల మంది

(2011 జనాభా లెక్కల ప్రకారం)

- సంప్రదాయ బోనాల జాతరకు సిద్ధమవుతున్న బంజారాలు
- రేపు సీత్ల యాడి ఉత్సవం

బంజారాలు సాధారణంగా అటవీ ప్రాంతాల్లో, ఊరికి దూరంగా, కొండకోనల్లో జీవిస్తుంటారు. వీరి నివాసాలను 'తండా'లు అని పిలుస్తారు. అలా ప్రారంభమైన ఊరి బయట నివాసం కాలక్రమంలో స్థిరపడిపోయి తండాలుగా రూపుదిద్దుకున్నాయి. 'తండా' అంటే సరుకు నింపిన గోనె సంచుల సమూహమని అర్థం. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయమే. వారిలో కొద్ది మంది వ్యాపారాలు చేసుకుంటూ బతికేవారని 'లంబాడీ'లని, 'సుగాలీ'లని పిలుస్తుంటారు. రాథోడ్, చౌహాన్, పవార్, జాదవ్ లాంటి రాజపుత్ర వంశాల పరంపరలోనే నేటికీ వీరు కొనసాగుతున్నారు. తండా ప్రజలు ఓ నాయకుడిని ఎన్నుకొని, ఆయన అదుపు ఆజ్ఞలో నివసిస్తారు. తమ ఆచార వ్యవహారాలను, సంస్కారాలను నియమంగా ఆచరిస్తారు, పాటిస్తారు. కష్ట సుఖాల్లో కలిసి జీవిస్తారు. పారదర్శక విలువలకు ప్రాధాన్యతనిస్తూ కొనసాగే తండాల విలక్షణ జీవనం ఇతరులకు ఆదర్శప్రాయం.



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు ఊరేగింపుగా వెళుతున్న బంజారా మహిళలు (ఫైల్)

భిన్నమైన వేషధారణ..

వేలాది మంది ఓ చోట గుంపుగా ఉన్నా... బంజారాలను వారి వస్త్రధారణ చటుక్కున పట్టించేస్తుంది. ఆధునికత పెరిగిన నేటి రోజుల్లోనూ వారు తమ సంప్రదాయ దుస్తులతో విభిన్నంగా ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంటారు. ఆభరణాలు, గవ్వలు కలబోసి రూపొందించిన దుస్తులు చాలా బరువుగా ఉంటాయి. వెండి, బంగారు, కంచు, ఇత్తడి లోహాలతోపాటు ఏనుగు దంతాలతో చేసిన గాజులు మోచేతి వరకూ ధరిస్తారు. తలపై నుంచి ధరించే వస్త్రం అంచుకు పావలా బిళ్లలు, అద్దాలు కుట్టి ఉంటాయి. కాళ్లకు ధరించే కడియాలు నడుస్తున్నపుడు చేసే వింత శబ్దాలు కూడా ఎంతో వినసొంపుగా ఉంటాయి. విభిన్న వస్త్రధారణతో పాటు తమకే సొంతమైన పాటలతో వారు చేసే నృత్యం ఎవరినైనా మైమరపిస్తుంది. లిపి లేకున్నా వీరు ఎక్కడ జీవిస్తే ఆ భాషను వంట పట్టించుకుని లంబాడీ పదాలతో అద్భుతంగా గీతాలను రచించుకున్నారు. వీటిలో దేశభక్తిని పెంపొందించేవే కాక ఆధ్యాత్మికతనూ పంచేవి కూడా ఉన్నాయి. ముఖ్యంగా వీరు కష్టజీవులు. కాయకష్టంతో జీవనం సాగించడంలో ఉన్న ఆనందం మరెందులోనూ లేదని వీరు అంటుంటారు.

శతాబ్దాల కిందటే అనంతలో...

ప్రపంచవ్యాప్తంగా సంచారం చేస్తూ అన్ని ప్రాంతాల్లో స్థిరపడినట్లే బంజారాలు 'ఉమ్మడి అనంత' లోనూ కొన్ని వందల ఏళ్ల కిందటే వేర్వేరు ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. 1978లో అప్పటి ప్రభుత్వం 'రోటీ కపడా ఔర్ మకాన్' పథకం కింద ప్రస్తుతమున్న నాయక్‌నగర్‌ను ఏర్పాటు చేసి చాలా మందికి పట్టాలిచ్చి ఒకచోటకు చేర్చింది. సంచార జాతులుగా కనపడే వీరు ఆధ్యాత్మికంగానూ చాలా ఉన్నత స్థితిలో ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బంజారాలు ఆరాధ్య దైవంగా, కొలుచుకునే సేవాలాల్ మహారాజ్ కూడా అనంత వాసి కావడం విశేషం. ఆయన ఆదేశానుసారం వారి ప్రాచీన ఆచారాలను వదలకుండా ఇతర ప్రాంతాలకూ అనంత బంజారాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఉగాది, దీపావళి, హోలీ పండుగలను విశేషంగా జరుపుకుంటారు. ఆధునిక పోకడలు ఎన్ని ఉన్నా... నేటికీ ఆచారాలను వదలకుండా లంబాడీల సంప్రదాయ పర్వదినాల సందడి నిత్యనూతనంగా సాగుతోంది.

అమ్మోరికి బోనాల సమర్పణ..

అనంతపురంలోని నాయక్‌నగర్ ఏర్పడిన తొలి రోజుల్లోనే బంజారాల కులదైవమైన మారెమ్మ ఆలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించుకుని.... 'సీత్ల యాడి ఉత్సవం' (అమ్మవారికి బోనాలు సమర్పించే జాతర) ఘనంగా నిర్వహించుకుంటూ వస్తున్నారు. తమ ఇష్టదైవాలైన సీతలయాడి, మే రామ భవాని, తుల్జా భవానీ, హింగ్లా భవానీ, కెంకాళి భవానీ, మంత్రాలి భవానీ, ద్వాలంగార్ భవానీ తదితర అమ్మవార్లను ఘనంగా పూజిస్తుంటారు. ఈ బోనాల పండుగకు జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన బంధువులు సైతం తప్పనిసరిగా తరలివస్తారు. సంప్రదాయ దుస్తులు ధరించి నాట్యం చేసే తీరు అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ నేపథ్యంలో విలక్షణ శైలితో సాగే బోనాల జాతరను ఈ నెల 2న (ఆరుద్రకార్తె, మంగళవారం) అనంతపురంలోని నాయక్‌నగర్‌లో నిర్వహించేందుకు బంజారాలు సిద్ధమయ్యారు.

ఎక్కడ ఉన్నా మేము ప్రత్యేకమే



ఒకనాడు ప్రపంచమంతటా తిరిగి వ్యాపారాలు సాగించిన చరిత్ర బంజారాలది. ఔరంగజేబు రాకతో బంజారాలు కకావికలమయ్యారు. అలా అంతటా తిరుగుతూ మా పూర్వీకులు అనంతకూ వలస వచ్చారు. ప్రాంతాలు వేరైనా మా సంప్రదాయాలు, పండుగలు, ఆచార వ్యవహారాలను వదలడం లేదు. మంగళవారం సాగే జాతరకు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేస్తున్నా. – శంకరశివరావు రాథోడ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అనంతపురం

సనాతన ధర్మాన్ని వీడలేదు



సుగాలీలు, లంబాడీలని పిలిచే మా జాతి ఒకనాటి రాజపుత్ర వీరుల వంశానికి చెందినదంటే చాలా మంది నమ్మరు. మా ఆచారాలు భిన్నంగానే ఉంటాయి. ప్రాణం పోయినా సనాతన ధర్మాన్ని వీడి ఇతర మతాల వైపు చూడం. శ్రీరాముడు మాకు ఆదర్శ పురుషుడు. అలాగే గ్రామదేవతలైన అమ్మవార్లను పంటలు బాగా పండాలని, వానలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ బోనాలు సమర్పిస్తాం. – శాంతిబాయి, నాయక్‌నగర్, అనంతపురం

ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించండి



సమావేశానికి హాజరైన ఎంపీఈఓలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీఈఓలు సమావేశమయ్యారు. అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 1,396 మంది ఎంపీఈఓలను రెగ్యులరైజ్ చేయాలని, లేదంటే హెచ్ఆర్ పాలసీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే రూ. 35వేలు వేతనం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర జిల్లాలకు బదిలీ చేసిన వారిని సొంత జిల్లాలకు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అసోషియేషన్ నాయకులు, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి సౌత్ జోన్ ఉమెన్ క్రికెట్ టోర్నీ



టోర్నీలో పాల్గొనే అనంతపురం జట్టు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-19 ఉమెన్ సౌత్ జోన్ టోర్నీ జరగనుంది. టోర్నీలో ప్రాతినిథ్యం వహించే జిల్లా జట్టును ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఏసీసీ కార్యదర్శి కె.మధుఆచారి, కోచ్‌లు షర్మాస్ వలి, ఆర్.కుమార్, కె.నరేష్ అభినందించారు.

సీఆర్ఎంటీలను విద్యాశాఖలో విలీనం చేయాలి

- మంత్రులు పయ్యావుల కేశవ్, సవితమ్మకు సీఆర్ఎంటీల వినతి



మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన సీఆర్ఎంటీ నాయకులు

బత్తలపల్లి: సమగ్ర శిక్షలో పని చేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ)లను విద్యాశాఖలో విలీనం చేస్తూ వెంటనే సర్వీసును క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని ఏపీసీఆర్పీ డబ్ల్యూఏ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో మంత్రి సవితమ్మను వేర్వేరుగా కలసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు అంజనరాజు, వెంకటరమణ మాట్లాడుతూ... ఉపాధ్యాయుల పోస్టులకు సమానమైన అర్హత ఉన్న వారినే సీఆర్ఎంటీలుగా ఎంపిక చేశారని గుర్తు చేశారు. దీంతో తామంతా ఏకోపాధ్యాయ పాఠశాలలను నిర్వహించడంతోపాటు విద్యాశాఖ ద్వారా జరిగే పలు సంక్షేమ కార్యక్రమాల్లో కీలకంగా పని చేస్తున్నామన్నారు. తమ 12 సంవత్సరాల అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, స్పష్టమైన జాబ్‌చార్ట్, ఉద్యోగ విరమణ వయస్సు పెంపు, విధుల్లో ఉండగా మరణించిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, కారుణ్య నియామకాలు తదితర అంశాల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల సీనియర్ నాయకులు ప్రభాకర్, శంకరనారాయణ, రమణ, ఎర్రిస్వామి, భాస్కర్, బ్రహ్మయ్య, శివప్రసాద్, ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని మండలాల సీఆర్ఎంటీలు, పెనుకొండ నియోజకవర్గ పరిధిలోని సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే హత్య

- వ్యక్తి హత్యకేసులో వీడిన మిస్టరీ
- నిందితుడి అరెస్ట్, కత్తి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హరినాథ్

కళ్యాణదుర్గం: గత నెల 28న కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని రైల్వే బ్రిడ్జి వద్ద వ్యక్తి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. అత్తతో వివాహేతర సంబంధం వద్దని హితవు పలికిన మామనే హతమార్చిన అల్లుడిని అరెస్ట్ చేశారు. ఆదివారం కళ్యాణదుర్గం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను సీఐ హరినాథ్ వెల్లడించారు.

ఏం జరిగింది?

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట గ్రామంలో నివాసముంటున్న వన్నూరు స్వామి (29) గత నెల 28న చెలిగెద్దుల కొండ వెనుక హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని గుర్తించిన రైతుల సమాచారం మేరకు కళ్యాణదుర్గం అర్బన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కళ్యాణదుర్గంలోని ఓ హోటల్‌లో కార్మికుడిగా వన్నూరు స్వామి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య వాణి ఉంది. తన సమీప బంధువైన గుత్తి మండలం కొజ్జేపల్లికి చెందిన 17 ఏళ్ల వయసున్న బొలిగొర్ల జయవర్ధన్‌తో వాణి చనువుగా ఉండేది. అయితే ఆ చనువును జయవర్ధన్ అలుసుగా తీసుకుని చివరకు ఆమెతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. విషయం తెలుసుకున్న వన్నూరుస్వామి పలుమార్లు జయవర్ధన్‌ను మందలించాడు. అత్తతో వివాహేతర సంబంధం మంచిది కాదని హెచ్చరించాడు. దీంతో ఎలాగైనా మామను హతమార్చి అత్తతో శాశ్వతంగా ఉండిపోవాలని నిశ్చయించుకున్న జయవర్ధన్ పథకం ప్రకారం జూన్ 28న సాయంత్రం 5.30 గంటలకు వన్నూరు స్వామిని కొండ వెనకకు రప్పించి కత్తితో గొంతుపై దాడి చేసి హతమార్చాడు.


24 గంటల్లోపు నిందితుడి అరెస్ట్..

వన్నూరు స్వామి హత్య కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ గౌతమి శాలి ఆదేశాల మేరకు డీఎస్పీ బి.శ్రీనివాసులు పర్యవేక్షణలో సీఐ హరినాథ్, సిబ్బందితో దర్యాప్తు ముమ్మరం చేశారు. తొలుత హత్యకు గల కారణాలపై భార్యతో ఆరా తీశారు. అనంతరం జూన్ 29న సాయంత్రం కళ్యాణదుర్గంలోని అనంతపురం రోడ్డులోని మారుతీ వే బ్రిడ్జి వద్ద తచ్చాడుతున్న జయవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవం బహిర్గతమైంది. అత్తతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే భావనతోనే మామను తానే హతమార్చినట్లు జయవర్ధన్ అంగీకరించాడు. నిందితుడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

జూదరుల అరెస్ట్

యాడికి: మండలంలోని చింతలాయపల్లి పరిసరాల్లో పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారంతో చింతలాయపల్లి పరిసరాల్లో ఆదివారం తనిఖీలు చేపట్టినప్పుడు తొమ్మిది మంది పేకాట ఆడుతూ పట్టుబడినట్లు యాడికి యూపీఎస్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ28,140 నగదు, 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ వెటరన్స్ విజయం



గెలుపొందిన హైదరాబాద్ వెటరన్ జట్టు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆదివారం జరిగిన ఆర్డీటీ అనంతపురం వెటరన్ క్రికెట్ టోర్నీ విజేతగా హైదరాబాద్ వెటరన్స్ జట్టు నిలిచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన అనంతపురం వెటరన్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్ ఎస్. సర్దార్ 21 పరుగులు, కేఎస్ షాబుద్దీన్ 15 పరుగులు, యూనస్ 12 పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లు సాయి చందర్, శ్రీకాంత్, మల్లికార్జున చెరో రెండేసి చొప్పున వికెట్లు కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 10.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 84 పరుగులు చేసి సునాయాశంగా లక్ష్యాన్ని ఛేదించింది. జట్టు బ్యాటర్ రజనీకాంత్ 29 బంతుల్లో మూడు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 34 పరుగులు, మరో బ్యాటర్ దామోదర్ 28 బంతుల్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 38 పరుగులు సాధించారు. 9 వికెట్ల తేడాతో హైదరాబాద్ వెటరన్స్ జట్టు గెలుపొందింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును కె.శ్రీకాంత్‌కు అందజేశారు. ఆర్డీటీ డైరెక్టర్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

తీర్థ యాత్ర పేరుతో దగా



యాత్రికులను మోసం చేసిన ఉదయ్‌శంకర్

అనంతపురం: తీర్థ యాత్రల పేరుతో తమను మోసం చేశాడంటూ అనంతపురానికి చెందిన ఉదయ్‌శంకర్‌పై పోలీసులకు పలువురు యాత్రికుల తరపున అనంతపురానికి చెందిన విశ్రాంత లెక్చరర్ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. వివరాలు... అనంతపురానికి చెందిన ఉదయ్‌శంకర్ ట్రావెల్స్‌కు చెందిన ఉదయ్‌శంకర్ చార్‌ధామ్ యాత్ర పేరుతో 90 మందిని ఓ బృందంగా చేసి విమానం ద్వారా డెహ్రాడూన్‌కు తీసుకెళ్లాడు. ఇందులో విమాన టికెట్‌కు రూ.10 వేలు పోను మిగిలిన రూ.59వేలు యాత్రకని తెలిపి ఒక్కొక్కరి నుంచి రూ.69 వేలు చొప్పున వసూలు చేశాడు. డెహ్రాడూన్ నుంచి హరిద్వార్‌కు వాహనాల ద్వారా తీసుకెళ్లాడు. హరిద్వార్‌లో రాత్రి వసతి, భోజనం ఏర్పాటు చేశాడు. మరుసటి రోజు ఉదయం అల్పాహారం అనంతరం బద్రీనాథ్‌కు వెళ్లే క్రమంలో వాహనంలోకి యాత్రికులను ఎక్కించి పత్తా లేకుండా పోయాడు. ఆ సమయంలో ఉదయ్‌శంకర్‌కు యాత్రికులు ఫోన్ చేస్తే హెలికాప్టర్ మాట్లాడే పనిలో ఉన్నానని తెలిపాడు. యాత్రికులను బకాయి మొత్తం ఫోన్ పే ద్వారా చెల్లించమని కోరాడు. దీంతో అందరూ ఫోన్ పే ద్వారా ఆ మొత్తాన్ని చెల్లించిన తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి, అందుబాటులో లేకుండా పోయాడు. ఆ సమయంలో దిక్కు తోచని యాత్రికులు ఎలాగోలా ఇబ్బంది పడుతూ డబ్బు సర్దుకుని స్వస్థలాలకు చేరుకున్నారు. కనీసం విమాన తిరుగు ప్రయాణ టికెట్లను సైతం ఉదయ్‌శంకర్ రద్దు చేసి, ఆ సొమ్మును కూడా దోచేశాడు. తమను మోసం చేసిన ఉదయ్‌శంకర్‌పై చర్యలు తీసుకుని న్యాయం చేకూర్చాలంటూ అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలతో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాలకు చెందిన యాత్రికుల తరపున తాను ఫిర్యాదు చేస్తున్నట్లు అనంతపురం రెండో పట్టణ సీఐ క్రాంతికుమార్‌తో విశ్రాంత లెక్చరర్ సత్యనారాయణ పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు నరసింహులు

• సన్మాన సభలో వక్తలు


నరసింహులు దంపతులను సన్మానిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: మూడున్నర దశాబ్దాలుగా రాజీలేని పోరాటాలు చేసి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగా నరసింహులు పేరు గడించారని వక్తలు కొనియాడారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం స్థానిక కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో సన్మానసభ నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ లిఖిత, డీవైఈఓ శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, వేణుగోపాల్, రఘురామిరెడ్డి, పాండురంగ వరప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయ ఉద్యమాలతో పాటు సమైక్యాంధ్ర ఉద్యమంలోనూ నరసింహులు కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు.

ధర్మపురి సేవలు అభినందనీయం


ధర్మపురి వెంకటేష్ దంపతులను సన్మానిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు తదితరులు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన ధర్మపురి వెంకటేష్ సేవలు అభినందనీయమని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరి బాబు అన్నారు. ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు స్కూల్లో ధర్మపురి వెంకటేష్ ఉద్యోగ విరమణ సభ జరిగింది. స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా, తెలుగు పండితుడిగా వెంకటేష్ అందించిన సేవలను వక్తలు కొనియాడారు. నగర పాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్ఓ సతీష్, అడ్మిన్ కార్యదర్శి ఏ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో సులువుగా కొలువు


నైపుణ్య పెంపుదలపై ఎంబీఏ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ టి.శేషాద్రి కిరణ్

అనంతపురం: నైపుణ్యాలు మెరుగుపరచుకుంటే కొలువులు సులువుగా దక్కుతాయని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఐక్యూఏసీ డీన్ డాక్టర్ టి.శేషాద్రి కిరణ్ అన్నారు. జేఎన్‌టీయూ (అనంతపురం) ఎంబీఏ క్యాంపస్ కళాశాలలో డేటా అనాలసిస్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డాక్టర్ టి.శేషాద్రి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాచార సేకరణ, ప్రాజెక్ట్ రిపోర్టుల రూపకల్పన, టూల్స్ వాడకం, విశ్లేషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.నారాయణ రెడ్డి, అడ్‌హాక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బీసీ లక్ష్మన్న, డాక్టర్ పి. విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు

తైక్వాండో జాతీయ రెఫరీగా మణీంద్ర



అనంతపురం: నగరానికి చెందిన జే.మణీంద్ర తైక్వాండో జాతీయ రెఫరీగా ఎంపికయ్యాడు. గత నెల 28, 29 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన నేషనల్ రెఫరీల సెమినార్‌లో పాల్గొని ఉత్తీర్ణత సాధించాడు. ఇతన్ని అంతర్జాతీయ రెఫరీ నవీన్ చంద్ర, జిల్లా తైక్వాండో సంఘం అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి శాంత రాజ్ తదితరులు అభినందించారు.

అరుణాచలంలో ఉచిత వసతి, భోజనం

అనంతపురం కల్చరల్: అరుణాచలం వెళ్లే అనంత భక్తులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు సాయిట్రస్టు అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అరుణాచలానికి వేలాది మంది వెళుతుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని క్షేత్రంలోని వేదనగరి ప్రాంతం వారిని ఒప్పించి అనంత వాసులకు ఉచిత వసతి, భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8712345520 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పట్టు పందిరి..పచ్చని లోగిలి


ఏపుగా పెరిగిన చెట్టు

జిల్లా పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం 'పట్టు పందిరి'ని తలపిస్తోంది. కలెక్టరేట్ సమీపాన జేఎన్‌టీయూకు వెళ్లే కూడలిలో ఉన్న ఈ కార్యాలయం ప్రవేశద్వారం చూడగానే ఎక్కడో పార్కులోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. ప్రాంగణంలో ఎటు చూసినా పచ్చదనం కనువిందు చేస్తోంది. ఏపుగా పెరిగిన కొబ్బరిచెట్లు, ఇతరత్రా వృక్షాలు, మల్బరీ, తీగజాతి మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అక్కడే చిన్నపాటి ఆలయం, పెద్ద దిగుడు బావి కూడా ఉన్నాయి. నిర్వహణ విషయంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎవరు వెళ్లినా కాసేపు సేద తీరుదామనుకునేలా వాతావరణం చూడముచ్చటగా ఉంది.

– అనంతపురం అగ్రికల్చర్:


నీటితో కళకళలాడుతున్న పెద్ద బావి


పట్టు పరిశ్రమ శాఖ జిల్లా కార్యాలయం


ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చిన్నపాటి దేవాలయం


పందిరి మాదిరిగా కనువిందు చేస్తున్న పచ్చని చెట్లు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

• నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్


కమిషనర్ మేఘ స్వరూప్‌ను సత్కరిస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

అనంతపురం కల్చరల్: మహిళలు తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటేనే కుటుంబమంతా ప్రశాంతంగా ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ అన్నారు. ఆదివారం స్థానిక కమలానగర్‌లోని ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రాంగణంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు, ఏఎన్ఎంలు, ఇతర మహిళా గ్రూపుల వారికి క్యాన్సర్‌పై అవగాహన, నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పీటీ పద్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కమిషనర్ మేఘస్వరూప్‌తో పాటు మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి ఆత్మీయ అతిథులుగా విచ్చేశారు. సంస్థ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. నగర సుందరీకరణలో ఇన్నర్‌వీల్ క్లబ్‌ను భాగస్వామి చేయాలని నిర్వాహకులు కోరారు. గైనకాలజిస్టు డాక్టర్ అరుణ సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. అలాగే డాక్టర్ మనోరంజన్‌రెడ్డి, ప్రశాంతి, హర్షిత, శివజ్యోతి, శారద, రమ్య, నవ్య తదితరులు మహిళలకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ పూర్వ అధ్యక్షులు ప్రతిమ, శ్రీవల్లి, సెక్రటరీ లక్ష్మీ, జయంతి, శ్యామల, అన్నపూర్ణ, కార్పొరేటర్లు అబూ సలేహా, దాదు, కమలభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ-96 క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయండి

• విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు వినతి


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ-96 క్వాలిఫైడ్ అభ్యర్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ-1996 క్వాలిఫైడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల కిందట ఉండవల్లిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. వివరాలను షేక్ అలీ, డీఎల్ రావు, ఆంజనేయులు, సుబ్బారావు, మల్లికార్జునరావు, గౌస్, నందకుమార్, తిప్పేస్వామి, వాసు, శేఖర్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. 1996 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు రాష్ట్రంలో 135 మంది ఉన్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కేవలం 19 మంది ఉన్నారన్నారు. గత ప్రభుత్వం 1998, 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేసిందన్నారు. మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్)పై వారికి పోస్టింగులు ఇచ్చారన్నారు. 1996 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కూడా అదే తరహాలో ఎంటీఎస్ కింద ఉద్యోగావకాశాలు కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

నూతన క్రిమినల్ చట్టాలను ఉపసంహరించాలి


నిరసన తెలుపుతున్న పౌర చైతన్య వేదిక నాయకులు

అనంతపురం అర్బన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సోమవారం (జూలై ఒకటో తేదీ) నుంచి అమల్లోకి తేవాలని చూస్తున్న మూడు నూతన క్రిమినల్ చట్టాలు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తాయని పౌర చైతన్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎస్.గోవిందరాజులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలను తక్షణం ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం టవర్ క్లాక్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా బాధ్యులు డి.రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోవిందరాజులు మాట్లాడుతూ ప్రజా హక్కుల విషయంలో కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఉన్న ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానాల్లో భారతీయ న్యాయ సన్హిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సన్హిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అదినియం (బీఎస్ఏ) చట్టాలను అమలు చేయనుందన్నారు. ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి ఈ చట్టాలను ఉపయోగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, వేదిక నాయకులు నాగముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహి..పాహి


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


మంజునాథస్వామి

ఆత్మకూరు: మండల పరిధిలోని పంపనూరు గ్రామంలోని వెలసిన సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఆకు పూజ, విశేష పూజలు చేశారు. భక్తులు ఆలయం బయట జమ్మి చెట్టు వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణకు రాహుకేతు హోమాలను నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

వైభవంగా వారాహి నవరాత్రులు


విద్యానరసింహ భారతీ స్వామి

అనంతపురం కల్చరల్: నగరంలోని జగద్గురు శంకర దత్తాత్రేయ మహాసంస్థానం శృంగేరి విరూపాక్ష మఠంలో వారాహి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతులు విద్యానరసింహ భారతీ స్వామి తెలిపారు. ఆదివారం మఠంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 14 వరకు రోజూ సాయంత్రం 6 గంటల నుంచి జగద్గురు పీఠంలో వారాహి అమ్మవారికి శ్రీచక్రార్చన, ఆవరణ పూజ జరుగుతాయని, చివరిరోజు మహావారాహి హోమం అనేక మంది రుత్వికుల సమక్షంలో పెద్ద ఎత్తున జరుగుతుందన్నారు. లోక కల్యాణార్థం సాగే వారాహి నవరాత్రుల వేడుకల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. అంతకుముందు మఠంలో వెలసిన వివిధ దేవతామూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదమందించారు.

బాట మారెమ్మకు పూజలు


అలంకరణలో బాట మారెమ్మ

కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లి సమీపంలోని ప్రధాన రహదారి పక్కన వెలసిన బాట మారెమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జీఎస్టీ సమస్యలు పరిష్కరించాం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్ కన్సల్టెంట్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు షరీఫ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీఎస్టీలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించామని చెప్పారు.

మౌనగిరి క్షేత్రంలో పూజలు

రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామ సమీపంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేసినట్లు నిర్వాహకులు ఈశ్వరయ్యస్వామి తెలిపారు.

అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని విజయవంతం చేయండి

చెన్నేకొత్తపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంత్యుత్సవాలను చెన్నేకొత్తపల్లిలో 3వ తేదీన నిర్వహించనున్నట్లు అందరివాడు ఉత్సవ సొసైటీ సభ్యులు తెలిపారు. ఆదివారం చెన్నేకొత్తపల్లిలో 44వ నంబరు జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన 10 అడుగుల కాంస్య విగ్రహం వద్ద కమిటీ సభ్యులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరివాడు ఉత్సవ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్.ఆంజనేయులు, ఎస్.ఎన్ వేణుగోపాల్, నాగరాజుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 3న ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తామన్నారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం చేస్తామని చెప్పారు. సాయంత్రం బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని వెండిరథంలో ఊరేగిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి భోజన వసతి కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు వెల్లడించారు.

రోడ్డుపై మురుగు.. చూడండి సారూ!


అనంతపురం క్లబ్ ముందు పారుతున్న మురుగు

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ ప్రజారోగ్యాధికారుల బాధ్యతారాహిత్యం ప్రజలకు శాపంగా మారుతోంది. నగరపాలక సంస్థకు కూతవేటు దూరంలో ఉన్న సుభాష్‌రోడ్డు అనంతపురం క్లబ్ ముందు డ్రైయినేజీ నిండి లలితకళాపరిషత్ వరకు రోడ్డుపై మురుగునీరు పారుతోంది. ప్రజారోగ్యాధికారులు తాత్కాలిక పనులు చేస్తూ మిన్నకుండిపోతున్నారు. వాస్తవంగా ఆ ప్రాంతంలో కాలువలపై నిర్మాణాలు చేపట్టారు. దీంతో పూడిక తీసే వీల్లేకుండా పోయింది. మురికివాడల్లో చిన్నపాటి నిర్మాణం చేపడితేనే కాలువ సమస్య వస్తుందని చెప్పే అధికారులు.. నగర నడిబొడ్డున కాలువలపై నిర్మాణాలు చేపట్టినా మొద్దు నిద్రలో ఉన్నారు. ప్రస్తుతం క్లబ్ నుంచి లలితకళాపరిషత్ వరకు పారుతున్న మురుగు కంపు కొడుతుండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

నల్లలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రాప్తాడు: మండలంలోని బుక్కచెర్ల గ్రామంలో వెలసిన నల్లలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

అనంతపురం: మెట్టినింటి వారి అనుమానపు వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. అనంతపురం త్రీటౌన్ సీఐ ధరణికిషోర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసనగర్‌కు చెందిన మంగళ రామమూర్తి కుమారుడు మంగళ రామకృష్ణకు గతేడాది సెప్టెంబర్ మూడో తేదీన బళ్లారికి చెందిన పవిత్ర (19)తో వివాహమైంది. మెట్టినింటిలో పవిత్ర ఎవరితో ఫోన్‌లో మాట్లాడినా అనుమానించేవారు. ఇదే విషయమై భర్తతో పాటు మామ రామమూర్తి, అత్త లక్ష్మీదేవి, ఆడబిడ్డ శ్రీదేవి మానసికంగా, శారీరకంగా హింసించేవారు. రెండు నెలల కిందట పవిత్ర తన తల్లిదండ్రులకు విషయం తెలిపింది. వారు అనంతపురం వచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడి సర్దిచెప్పి వెళ్లిపోయారు. అయినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. శనివారం అనుమానం పేరిట రామకృష్ణ మరోమారు భార్యతో గొడవపడ్డాడు. తిట్టడమే కాకుండా చేయి చేసుకున్నాడు. మనస్తాపానికి గురైన పవిత్ర ఆదివారం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి మంజునాథ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి కార్యక్రమాలు

నీలకంఠేశ్వరస్వామికి పూజలు

రాప్తాడు: మండల కేంద్రంలోని స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

102 మందికి వైద్య సేవలు

రాప్తాడు: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం 102 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ఎర్రితాత ఆలయంలో పూజలు

రాప్తాడు: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో వెలసిన ఎర్రితాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఎర్రిస్వామి తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: మండలంలోని బొమ్మేపర్తి, లింగనపల్లి, పుల్లరేవు, యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, హంపాపురం, గొల్లపల్లి, మరూరు, ఎం.కృష్ణాపురం, ఎం.చెర్లోపల్లి, పాలవాయి, ఎం.బండమీదపల్లి, పర్వతదేవరపల్లి, ముక్తాపురం తదితర గ్రామాల్లోని గ్యాస్ వినియోగదారులకు సోమవారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్: 08554 286777ను సంప్రదించవచ్చు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు పేర్కొన్నారు. నగరంలో ఏమైనా సమస్యలుంటే అర్జీ అందజేయవచ్చని ప్రజలకు సూచించారు.

ఇంటి వద్దే పింఛన్

అనంతపురం కార్పొరేషన్: సామాజిక భద్రత పింఛన్‌ను సోమవారం ఇంటి వద్దకే వెళ్లి అందించాలని సచివాలయ సిబ్బందిని అదనపు కమిషనర్ శ్రీహరి బాబు ఆదేశించారు. ఆదివారం నగర పాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులుతో కలసి అదనపు కమిషనర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాధ్యమైనంత త్వరగా పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సీఎం సందేశం ప్రతిని ప్రజలకు అందించాలన్నారు. పింఛన్ అందించినట్లు అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలన్నారు.

పుస్తకావిష్కరణ వాయిదా

అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఐదు గంటలకు నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించ తలపెట్టిన 'నిత్యనవనీతం.. నబీరసూల్ సుభాషితం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు రచయిత కంబదూరు షేక్ నబీరసూల్ ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీ ప్రకటించేవరకు సాహితీ అభిమానులు సహకరించాలని కోరారు.